క్లుప్తంగా

సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలి



అయిజ: మంత్రి నిరంజన్‌రెడ్డి ఎదుర్కొంటున్న భూ కుంభకోణంపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామ చంద్రారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి కొనుగోలు చేసిన పంటపొలాలకు సంబంధించి భూ రికార్డులు మాయమయ్యాయని ఆరోపించారు. రైతులకు అండగా ఉండాల్సిన మంత్రి సొంత కుటుంబ ఆస్తులు ఎదుగడానికి అండగా ఉన్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నరసింహయ్యశెట్టి, నాగరాజు, వెంకటేష్, శివన్న, లక్ష్మణ్‌గౌడు పాల్గొన్నారు.

టీజీసీటీఏ డైరీ ఆవిష్కరణ



గద్వాలన్యూటౌన్: స్థానిక ప్రియదర్శిని మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం తెలంగాణ గవర్నమెంట్ కాలేజ్ టీచర్ అసోసియేషన్ 2023 డైరీ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీపతి నాయుడు డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నర్సింహులు, ట్రెజరర్ సంపత్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పాఠశాలకు పలు వస్తువుల వితరణ



ఉండవెల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు క్యూబిక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సైన్స్, సోషల్ మెటీరియల్, బ్యాండ్ సెట్‌లను గురువారం ఉపాధ్యాయులకు అందజేశారు. ఫౌండేషన్ వారు ప్రతి ఏడాది వస్తువులు వితరణ చేస్తుంటారని ఈ ఏడాది సైన్స్ ల్యాబ్‌కు సరిపడు రసాయనిక పదార్థాలు, బీరువాలు, బెంచీలు, పరికరాలు, సోషల్‌కు సంబంధించిన గ్లోబుల్ పరికరం, మ్యాప్‌లు, బ్యాండ్ సెట్లు, 10 ఫ్యాన్లు, 10 లైట్లు అందించినట్లు తెలిపారు. దాదాపు రూ.2లక్షల50వేల విలువ గల పరికరాలు అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం సుందర్ రెడ్డి, ఉపాధ్యాయులు మనోహర్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, ప్రసన్న, మద్దిలేటి, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

రైతు బీమా చెక్కు అందజేత



గట్టు: రైతు కుటుంబాలకు రైతుబీమా పరిహారం ఎంతో ధీమా లభిస్తుందని ఎంపీపీ విజయ్‌కుమార్ తెలిపారు. గురువారం చాగదోణకు చెందిన జయమ్మ కుమారుడు సుధాకర్‌కు రూ.5లక్షల బీమా చెక్కును ఎంపీపీ అందజేశారు.

తాగునీటి సమస్యపై అధికారుల విచారణ



గట్టు: మండల కేంద్రంలో తాగునీటి సమస్యపై అధికారులు గురువారం విచారించారు. 5, 6 వార్డుల్లో మిషన్ భగీరథ నీటి సరఫరా కావడం లేదని, రెండేళ్లుగా తాము తాగు నీటి కోసం అనేక ఇబ్బందులు పడుతున్నట్లుగా పలువురు బుధవారం కలెక్టరేట్ వద్ద ఆందోళన చేశారు. దీంతో మిషన్ భగీరథ డీఈఈలు మోహిన్, రవిచంద్రారెడ్డి, ఏఈ కృష్ణయ్య కత్రిగేరి, బండమీది గేరిలో పర్యటించారు. తాగునీటి కోసం తాము రెండేళ్లుగా ఇబ్బంది పడుతున్నామని, వేసవికాలంలో మరింత ఇబ్బంది పడే పరిస్థితి ఉన్నట్లు వాపోయారు. 5, 6 వార్డులకు ప్రత్యేకంగా వాటర్ ట్యాంకును నిర్మించాలని కోరారు. సమస్యకు పరిష్కారం చూపుతామని అధికారులు హామీ ఇచ్చారు.

'టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌ను సస్పెండ్ చేయాలి'

గద్వాల అర్బన్: ప్రశ్నాపత్రాల లీకేజీ సంఘటనలో టీఎస్‌పీఎస్సీ బోర్డు చైర్మన్‌ను సస్పెండ్ చేయాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ సురేష్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పేపర్ లీకేజీతో నిరుద్యోగుల జీవితాలు రోడ్డున పడ్డాయన్నారు. చైర్మన్, కార్యదర్శి, సభ్యులను తొలగించిన తర్వాతే పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

'ఉపాధి'తో కాల్వలకు ప్రయోజనం



చిన్న ధన్వాడలో లింక్ కెనాల్‌లో పనులు చేస్తున్న కూలీలు

- ఆర్డీఎస్ లింక్ కెనాల్‌లో పూడిక తీత పనులు చేస్తున్న కూలీలు
- కూలీలకు, రైతులకు ప్రయోజనం
- 3 ఫీట్ల వరకు మట్టి, పిచ్చిమొక్కల తొలగింపు

రాజోళి: ఉపాధి హామీ పథకంలో భాగంగా ఆర్డీఎస్ ఆయకట్టు రైతులకు ప్రయోజనం చేకూరుతుంది. మండలంలో ఈ నెల మొదటి వారం నుంచి మొదలైన ఉపాధి హామీ పనులు ఎక్కువగా రైతులకు ప్రయోజనం చేకూరేవిగా చేపడుతున్నారు. ఈ క్రమంలోనే ఆర్డీఎస్ ఆయకట్టుకు అనుబంధంగా ఉన్న వనరుల నుంచి కెనాల్‌కు వచ్చి, అక్కడి నుంచి లింక్ కాల్వలకు నీరు అందుతుంది. ఈ క్రమంలో నీరు సాఫీగా ప్రవహించకుండా ఉండటంతో దిగువన ఉన్న రైతులకు సక్రమంగా అందడం లేదు. ఈ కాల్వల్లో పనులు చేపట్టేందుకు కూడా అందరూ కలిసి రాకపోవడం వల్ల పలు సమస్యలు రైతులను వేధించేవి. ప్రస్తుతం ఉపాధి హామీ పనులతో కూలీలు ఈ కాల్వల గుండా పనులు చేస్తుండటంతో ఆయకట్టుకు బలం చేకూరే విధంగా నీరు అందించేందుకు కాల్వ తయారవుతుందని రైతులు అంటున్నారు.

రైతుల హర్షం

ఈ నెలలో ప్రారంభమైన పనులన్నీ దాదాపు ఆర్డీఎస్‌కు ఊతమిచ్చేలే సాగుతుండంటతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని చిన్న ధన్వాడ, పెద్ద ధన్వాడ, మాన్‌దొడ్డి, తూర్పుగార్లపాడు, పడమటి గార్లపాడు, పలు గ్రామాల్లో పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. దీంతో వందల ఎకరాల్లో ఆయకట్టుకు నీరు సాఫీగా ప్రవహిస్తుందని రైతులు అంటున్నారు. కొన్నేళ్ల నుంచి కాల్వల్లో ఎలాంటి పనులు చేపట్టకపోవడంతో మట్టి, సిల్ట్, పిచ్చి మొక్కలు నిండిపోయాని, ఇప్పుడు అవన్నీ పూర్తిగా తొలగిపోతున్నాయని తెలుపుతున్నారు.

65 మంది సగటున..

మండలంలో చేపడుతున్న పనుల్లో ప్రతి గ్రామంలో రోజు సగటును 65 మంది కూలీల చొప్పున పనులు చేపడుతున్నారు. వారికి ప్రతి గ్రామంలో వేర్వేరుగా చేస్తున్న పనుల్లో కాల్వల్లో 3 ఫీట్ల లోతు వరకు మట్టి, సిల్ట్ తొలగింపు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇంత మేరలో పని చేయడం వల్ల ప్రస్తుతం ఉన్న ప్రవాహాని కంటే అదనంగా నీరు దిగువకు సాఫీగా పారుతుంది.

ఆయకట్టుకు మేలు



ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలు చేస్తున్న పనితో రైతులకు మేలు కలుగుతుంది. ప్రధాన కాల్వకు అనుబంధంగా ఉన్న పిల్ల కాల్వల ద్వారా వందల ఎకరాల ఆయకట్టు సాగవుతుంది. దానికి నీరందించే పిల్ల కాల్వల్లో మట్టి, సిల్ట్ తొలగింపు చేయడం వల్ల రైతులకు ప్రయోజనం. దీంతో పాటుగా కూలీలకు ఉపాధి లభిస్తుంది.

– పరమేష్ గౌడ్, పెద్ద ధన్వాడ, రైతు

రైతులను దృష్టిలో పెట్టుకునే..



ఉపాధి పనులను ఎక్కువగా రైతులకు మేలు చేసే విధంగా ప్రణాళిక రూపొందించాం. చాలా గ్రామాల్లో ఆయకట్టుకు నీరందించే లింక్ కెనాల్‌లతో రైతులకు కొంత ఇబ్బందిగా ఉందని తెలుసుకుని, వాటిపై దృష్టి పెట్టాం. చిన్న ధన్వాడలో ఈ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

– గోవిందురావు, ఎంపీడీఓ, రాజోళి

జీవితం ప్రజాసేవకే అంకితం

సాక్షి, నెట్‌వర్క్: ప్రజాసేవకే జీవితం తన అంకితమని ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. అలంపూర్‌చౌరస్తాలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే జన్మదిన వేడుకలను బీఆర్‌ఎస్ నాయకుల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి నియోజకవర్గంలోని జెడ్పీటీసీలు, ఎంపీపీలు, మున్సిపల్ చైర్‌పర్సన్‌లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు హాజరయ్యారు. అయిజ మండలంలో గురువారం వివిధ గ్రామాల్లో, మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులు కేక్ కట్‌చేసి సంబరాలు చేశారు. వడ్డేపల్లి పురపరిధిలోని శాంతినగర్‌లో బీఆర్‌ఎస్ నాయకులు జెడ్పీటీసీ కాశపోగు రాజు కార్యాలయం వద్ద కేక్ కట్‌చేసి వేడుకలు నిర్వహించారు. మానవపాడు మండలకేంద్రంలోని గాంధీచౌక్‌లో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, వెంకట్రాములు అధ్యక్షతన కేక్‌కట్ చేసి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాజోళి మండల కేంద్రం బీఆర్‌ఎస్ నాయకులు కేక్ కట్ చేసి వేడుకలు చేశారు. ఉండవెల్లి మండల కేంద్రంలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు.



అలంపూర్‌చౌరస్తాలో ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

మంత్రిపై ఆరోపణలు అవాస్తవం

ఎర్రవల్లిచౌరస్తా: వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డిపై బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు చేసిన ఆరోపణలు అవాస్తవమని ఇటిక్యాల ఎంపీపీ స్నేహ, జెడ్పీటీసీ హనుమంత్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రంగారెడ్డి మండిపడ్డారు. గురువారం ఇటిక్యాల మండలంలోని ఎర్రవల్లి చౌరస్తాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఒకాలత్ పుచ్చుకున్న రఘునందన్‌రావు మతిభ్రమించి మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. మంత్రిపై పసలేని ఆరోపణలు చేస్తే రాష్ట్ర ప్రజలు ఊరుకోరన్నారు. మంత్రి నిరంజన్‌రెడ్డి వ్యవసాయ కుటుంబంలో జన్మించడంతో ఆయనకు వ్యవసాయ భూములంటే ఎంతో మక్కువన్నారు. ఆయనకున్న ప్రతి గుంట భూమి కూడా అధికారిక భూమి అని దానిని తప్పుదోవ పట్టించేందుకే అసత్య ఆరోపణలు చేయడం బీజేపీ నాయకులకు తగునా అని ప్రశ్నించారు. చందూరు భూములను ఎప్పుడైనా స్వేచ్ఛగా సర్వే చేసుకోవచ్చని దానికి కావాల్సిన ఏర్పాటన్నీ స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు చూసుకుంటారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే రఘునందన్‌రావు మంత్రికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రవీందర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, సుధాకరెడ్డి, నర్సింహారెడ్డి, కోటిరెడ్డి, రాగన్న, పెద్దలక్ష్మన్న, వీరబాబు, అశోక్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

ప్రతిష్టాత్మకంగా 'కంటివెలుగు'



అలంపూర్‌లో కంటి పరీక్షలు చేయించుకుంటున్న చైర్‌పర్సన్ మనోరమ



ఆరగిద్దలో కంటి పరీక్షలను నిర్వహిస్తున్న వైద్యులు

అలంపూర్: రాష్ట్రంలో ప్రభుత్వం కంటి వెలుగును ప్రతిష్టాత్మకంగా చేపడుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ అన్నారు. పట్టణంలోని 2వ వార్డులోని హరిజనవాడ పాఠశాలలో కంటి వెలుగు 2వ విడత కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. ప్రభుత్వం పేదల కంటి సమస్యలను దూరం చేయడానికి సీఎం కేసీఆర్ కంటి వెలుగు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 10వార్డుల్లోని 8 వార్డుల్లో కార్యక్రమం పూర్తి చేసినట్లు తెలిపారు. 2, 3 వార్డులో నిర్వహించాల్సి ఉందన్నారు. ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ హేమ మానస మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో 32 రోజులుగా నిర్వహించిన శిబిరంలో 4,677 మందికి కంటి పరీక్షలు చేసినట్లు తెలిపారు. 473 మందికి కాటారాక్టుకు రెఫర్ చేయగా 801 మందికి రీడింగ్ గ్లాసెస్ అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ లక్ష్మీదేవమ్మ, మద్దిలేటి, సూపర్‌వైజర్ అక్కమ్మ, ఏఎన్‌ఎంలు ఉన్నారు.

కొనసాగుతున్న కంటిపరీక్షలు

గట్టు: మండలంలోని ఆరగిద్ద, ఇందువాసిలో కంటి వెలుగు శిబిరాలు కొనసాగుతున్నాయి. గురువారం రెండు గ్రామాల్లో వైద్యులు కంటి పరీక్షలను నిర్వహించారు. మొత్తం 295 మంది పరీక్షలు చేయించుకున్నట్లు వైద్యాధికారులు తెలిపారు. 19 మందికి కంటి అద్దాలను పంపిణీ చేయగా, 23 మందికి అద్దాల కోసం ప్రతిపాదనలు పంపినట్లు వైద్యాధికారులు తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు తిమ్మప్ప, నర్సింహులు, హెల్త్ సూపర్‌వైజర్లు మక్సూద్, స్వర్ణలత, ఏఎన్‌ఎంలు నర్మద, రేష్మ, ఈశ్వరమ్మ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలి

మల్దకల్: అంగన్‌వాడీ కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలని ప్రాజెక్టు సీడీపీఓ కమలాదేవి సూచించారు. గురువారం ప్రాజెక్టు పరిధిలోని మల్దకల్, గట్టు, అయిజ మండలాలకు చెందిన అంగన్‌వాడీ టీచర్లతో సమావేశాన్ని నిర్వహించారు. కేంద్రాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటుగా ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకుని ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకే నిర్వహించాలన్నారు. ఎత్తు, బరువు తక్కువగా ఉన్న చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని టీచర్లకు సూచించారు. గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం తరఫున వచ్చిన పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేయడంతో పాటుగా ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తను ఎప్పటికప్పుడు తెలియజేయాలని సూచించారు. గ్రామాల్లో బాల్య వివాహాలు కాకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నాగరాణి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీడీపీఓ కమలాదేవి

పశు సంరక్షణకు ప్రత్యేక చర్యలు

ఎర్రవల్లిచౌరస్తా: వేసవిలో పశు సంరక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మండల పశు పశువైద్యాధికారి భువనేశ్వరి గురువారం తెలిపారు. వేసవిలో పశువులు, గొర్రెల సంరక్షణపై పెంపకందారులకు సూచనలు, సలహాలను అందించారు. వేసవిలో తీవ్రమైన ఎండలతో పాటు వడగాలుల రావడంతో పశువులు వడ దెబ్బకు గురై ఉత్పాదక శక్తిని కోల్పోవడమే కాకుండా కొన్ని సందర్భాలలో మృతి చెందే అవకాశం ఉందన్నారు. పశువులు, గొర్రెలను వీలైనంత వరకు ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే మేపేందుకు బయటికి తీసుకెళ్లాలని తెలిపారు. షెడ్లు లేని వారు ఎండ సమయంలో మందలను చెట్ల నీడలో మాత్రమే ఉంచాలన్నారు. ప్రతి పశువుకు తప్పకుండా 60 నుంచి 70 లీటర్ల వరకు నీటిని తప్పకుండా తాగించాలన్నారు. వీలైనంత ఎక్కువగా పచ్చిమేతను అందించాలని.. దానను అందిస్తే తడిపిన తర్వాతే ఇవ్వాలన్నారు. వడదెబ్బకు గురైన పశువుల శరీర ఉష్ణోగ్రత పెరిగి భారంగా శ్వాసను తీస్తుంటాయన్నారు. అలాంటి సమయంలో తల, శరీర భాగాలను నీటితో తడుపుతూ సమీపంలోని పశు వైద్యాధికారి సంప్రదించి వాటికి చికిత్సను చేయించాలని పేర్కొన్నారు.

ఆలయాల్లో అమావాస్య పూజలు

కేటీదొడ్డి: మండలంలోని వెంకటాపురంలో వెలసిన పాగుంట లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం అమావాస్య సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో కల్యాణం జరిపించారు. అర్చకులు స్వామి వారికి అభిషేకం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయం వద్ద భక్తులకు అన్నదానం, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు.

ఉండవెల్లి: మండలంలోని డీ.బుడిదపాడు ఆంజనేయస్వామి ఆలయంలో గురువారం అమవాస్య సందర్భంగా ఆంజనేయ స్వామికి ఆకుపూజ నిర్వహించి, సీతారాముల విగ్రహాలను పల్లకీలో ఆలయం చుట్టూ ఊరేగించారు.

ధరూరు: మండలంలోని చింతరేవులలో ఆంజనేయస్వామి ఆలయంలోని అమావాస్య సందర్భంగా ఉడిపి అదారు మఠం పీఠాధిపతులు శ్రీఈశప్రయతీర్థస్వామిజీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.



కేటీదొడ్డి మండలం పాగుంటలో కల్యాణానికి వస్తున్న భక్తులు



డి.బూడిదపాడులో అన్నదానంలో పాల్గొన్న భక్తులు

రేషన్ బియ్యం పట్టివేత

గద్వాల క్రైం: రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్‌ఐ అబ్దుల్‌షకుర్ తెలిపారు. గురువారం ఉదయం రాఘవేంద్రకాలనీలో గూడ్స్ ఆటోలో 12 సంచుల రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు సమాచారం మేరకు సిబ్బంది సాయంతో ఆటోను అదుపులోకి తీసుకుని ఎరుకలి శాంతన్నపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పిల్లల తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలి

రాజోళి: వేసవికాలం పిల్లల తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని ఎస్‌ఐ సీహెచ్ కుర్మయ్య గురువారం సూచించారు. వేసవికాలం కావడంతో గ్రామాల్లో పిల్లలు బావులు, చెరువులకు ఈత కోసం వెళ్తుంటారని, సరదాగా చేసే వారి కాలక్షేపం ప్రమాదాలను కొని తెస్తుందని తెలిపారు. బావుల వద్ద కొందరు చేసే ఆకతాయిల వేషాలకు బలి కావాల్సి వస్తుందని చెప్పారు. తప్పనిసరిగా ఈత నేర్వాలనుకుంటే, తల్లిదండ్రులు, ఎవరైనా పెద్దలు దగ్గరగా ఉండి నేర్పించాలని, అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వాహనాలను మైనర్లకు ఇచ్చి రోడ్లపైకి పంపవద్దని ఎస్‌ఐ హెచ్చరించారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

అలంపూర్: సమస్యలు పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శులు ఎమ్మెల్యేను కోరారు. అలంపూర్ చౌరస్తాలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే అబ్రహంను నియోజవర్గంలోని కార్యదర్శులు గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యదర్శులను రెగ్యులర్ చేయాలని కోరారు. సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తానని భరోసా ఇచ్చినట్లు తెలిపారు.

ప్రజాప్రతినిధులకు..

ఉండవెల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో వైస్ ఎంపీపీ దేవన్నకు పంచాయతీ కార్యదర్శులు గురువారం వినతి పత్రం అందజేశారు. అదేవిధంగా సర్పంచ్‌లకు తమను రెగ్యులర్ చేయాలని వినతి ఇచ్చారు.

చంద్రబాబు జన్మదిన వేడుకలు



శాంతినగర్: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలను నాయకులు గురువారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో వడ్డేపల్లి మండల అధ్యక్షుడు శివకుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. కార్యక్రమంలో పూర్ణచందర్‌రావు, చాణక్య, గోపాలరావు, మహిపాల్‌రెడ్డి, శ్రీనివాస్, ప్రసాద్, గోకారి పాల్గొన్నారు.

కారు బోల్తా.. తప్పిన ప్రమాదం

ఎర్రవల్లిచౌరస్తా: జాతీయ రహదారిపై కారు అదుపుతప్పి బోల్తా పడటంతో పెను ప్రమాదం తప్పిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా.. జిల్లా సంచార జాతుల సంఘం అధ్యక్షుడు రామ్‌చందర్ కుటుంబ సభ్యులు తమ కారులో అమావాస్య సందర్భంగా గద్వాల నుంచి బీచుపల్లికి పుణ్యక్షేత్రానికి వెళ్తుండగా జాతీయ రహదారిపై పదవ పటాలం సమీపంలోకి రాగానే ప్రమాదవశాత్తు కారు అదుపుతప్పి ఒక్కసారిగా బోల్తాపడింది. ప్రమాద సమయంలో కారులో నలుగురు యువకులు ఉండగా తేలికపాటి గాయాలతో బయటపడ్డారు.

రంజాన్ తోఫా పంపిణీ



శాంతినగర్‌లో రంజాన్ తోఫా పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్ కరుణ



అయిజలో పంపిణీ చేస్తున్న చైర్మన్ దేవన్న

శాంతినగర్: వడ్డేపల్లి పురపాలిక పరిధిలోని శాంతినగర్ జమ్ములమడుగు కాలనీలోని ప్రభుత్వం ద్వారా వచ్చిన రంజాన్ తోఫాను మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణ గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో కలీముల్లా, మౌలానా, రెహమాన్, షేక్, మక్బూల్, మాలిక్ పాల్గొన్నారు.

అయిజ: రంజాన్ సందర్భంగా గురువారం పట్టణంలోని మాసుంపీర్ సాహెబ్ దర్గాలో మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న వార్డు కౌన్సిలర్లతో కలిసి ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ చేశారు. పండుగను సంతోషంగా చేసుకునేందుకు ప్రభుత్వం ముస్లింలకు తోఫా అందిస్తుందని తెలిపారు. రంజాన్ పండుగను సంతోషంగా చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మహబూబ్‌బాష, చాంద్ హఫీజ్‌సాబ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కుల, మతీలకు అతీతంగా పండుగ

మానవపాడు: రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం ఏటా నిరుపేద ముస్లింలకు రంజన్ తోఫా అందిస్తుందని బీఆర్‌ఎస్ నాయకులు దామోదర్‌రెడ్డి, గొల్ల వెంకట్రాములు అన్నారు. గురువారం మండల కేంద్రంలో 200 మందికి తోఫా అందించారు. కార్యక్రమంలో మహబూబ్, హుస్సేన్, షాకీర్, అర్షద్, ఖాజా తదితరులు పాల్గొన్నారు.



మానవపాడులో..

ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇఫ్తార్

శాంతినగర్: రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు చేపడుతున్న ముస్లింలకు ప్రభుత్వం ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. ముందుగా నమాజ్ చదివిన అనంతరం ముస్లింలు విందులో పాల్గొన్నారు. అందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుతూ రజాక్ మౌలానా, కలీముల్లా మౌలానా దువా చదివారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ముస్లింలు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

కేటీదొడ్డి: వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని వీఓఏ సంఘం మండల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని వీఓఏలు సమ్మె నిర్వహించారు. సమ్మె శిబిరాన్ని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వీవీ నర్సింహ సందర్శించి సంఘీభావం తెలిపారు. ఆయన మాట్లాడుతూ వీఓఏలతో వెంటనే చర్చలు చేసి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అంజి, తిమ్మప్ప, కిరణ్, పావని, శ్రీనివాసులు, తిరుమల్, మహదేవ్ పాల్గొన్నారు.

సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి

మల్దకల్: వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని సంఘం మండల అధ్యక్షుడు బాషా డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వీఓఏలు మండల మహిళా సమాఖ్య భవనం ఎదుట ఆందోళన నిర్వహించారు. కార్యక్రమంలో వీఓఏలు చంద్రాములు, అపర్ణ, మహేందర్, హనుమంతు, వెంకట్రాములు, మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.



కేటీదొడ్డిలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వీవీ నర్సింహ

గట్టు: వీఓఏలను ప్రభుత్వం ఇక నుంచి సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని వీఓఏలు డిమాండ్ చేశారు. గురువారం వివిధ గ్రామాలకు చెందిన వీఓఏలు మహిళా సమాఖ్య భవనం ఎదుట ఆందోళనకు దిగారు. ప్రభుత్వం వీఓఏల న్యాయమైన డిమాండ్లను తీర్చాలని కోరారు. ప్రమాద బీమా కల్పించాలని, గ్రేడింగ్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో వెంకటేష్, వీరన్న, భాస్కర్, రవిచంద్ర, వీరేష్‌గౌడు, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఈ ప్రయాణం.. ఎంతో ప్రమాదం



గద్వాల నుంచి మల్దకల్‌కు కూలీలను తరలిస్తున్న ఆటో

మల్దకల్: ప్రమాదాల బారిన పడిన సంఘటనలు కళ్లముందే కనిపిస్తున్నా కొందరు ప్రైవేట్ వాహన డ్రైవర్లు, ప్రయాణికులు ఇంకా నిర్లక్ష్యం వీడలేదు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు బస్సు సౌకర్యాలు లేకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు ప్రైవేట్ వాహనదారులను ఆశ్రయించడంతో వారు పరిమితికి మించి చేరవేస్తూ ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. మండలంలోని వివిధ గ్రామాలలో రైతులు మిరుప పంట తీసేందుకు కర్ణాటకలోని వివిధ గ్రామాలకు చెందిన కూలీలతో పాటు గద్వాల, ధరూరు, గట్టు ప్రాంతాల నుంచి గూడ్సు, ప్యాసింజర్ వాహనాల్లో పరిమితికి మించి కూలీలను తరలిస్తున్నారు. ఏడుగురు ఎక్కాల్సిన ఆటోలో 12నుంచి 15మందిని చేరవేస్తున్నారు. చిన్నపాటి ప్రమాదాలు జరిగినా భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గూడ్సు వాహనాల్లో 30నుంచి 70మంది ప్రయాణికులను చేరవేయడం నేరమని తెలిసినా డ్రైవర్లు నిర్లక్ష్యంతో ఎక్కువ మంది ఎక్కించుకుని అధిక చార్జీలను వసూలు చేస్తున్నారు. పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తున్న వాహనాలపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. బస్సు సౌకర్యం కల్పించి సమస్యను పరిష్కరించాలని అధికారులకు మొరపెట్టుకున్నా ఆర్టీసీ అధికారులు పట్టించుకోకపోవడంతో గత్యంతరం లేక ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తుందని గ్రామస్తులు వాపోతున్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు



పరిమితికి మించి ప్రయాణికులను చేరవేసే డ్రైవర్లపై చర్యలు తీసుకుంటాం. గూడ్సు వాహనాల్లో ప్రయాణికులను చేరవేసి నిబంధనలను ఉల్లంఘించే వారిపై కేసులు నమోదు చేస్తాం. డ్రైవర్ల లైసెన్సులను రద్దు చేస్తాం. ప్రయాణికులు, కూలీలు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించవద్దు.

– శేఖర్, ఎస్‌ఐ, మల్దకల్